క్లుప్తంగా

గ్రూప్‌-1 ర్యాంకర్‌కు సన్మానం



వర్ధన్నపేట : మండలం బంధనపల్లికి చెందిన ఇల్లందుల రాకేశ్‌ను అతడు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో మహా ఆది సేవ సమితి (మాస్‌) ఆధ్వర్యంలో సోమవారం శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేవ సమితి ప్రతినిధులు మాట్లాడారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి పట్టుదలతో కష్టపడి గ్రూప్‌–1 పరీక్షల్లో ప్రతిభ చాటి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఓ డాక్టర్‌ రామ్మూర్తి, డాక్టర్‌ విజయకుమార్‌, విక్రమ్‌కుమార్‌, కొండేటి మధు, కొండేటి భాస్కర్‌, సుదర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

మండల వాసికి డాక్టరేట్‌



నర్సంపేట రూరల్‌ : చెన్నారావుపేటలోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన తాళ్ల అజయ్‌కి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. సోషల్‌ సైన్స్‌ డీన్‌, ప్రస్తుత రాష్ట్ర ఆర్కియాలజీ మ్యూజియం, హెరిటేజ్‌ డిపార్ట్‌మెంట్‌ డైరెక్టర్‌, రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ అర్జున్‌రావు కుతాడి పర్యవేక్షణలో 'తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర (1950–2014)' అంశంపై అజయ్‌ చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ అందింది. పరిశోధనలో భాగంగా అజయ్‌ జాతీయ ఫెలోషిప్‌ ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ (ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్స్‌ రీసెర్చ్‌)కి ఎంపికవడంతోపాటు డాక్టోరల్‌ ఫెలోగా పరిశోధన సాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను సమర్పించాడు.

జేసీబీ నుంచి డీజిల్‌ చోరీ

పర్వతగిరి : మండలంలోని తురుకల సోమారంలోని రోడ్డు పక్కన పొలంలో నిలిపి ఉంచిన జేసీబీ నుంచి 400 లీటర్ల డీజిల్‌ చోరీకి గురైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు దేవేందర్‌ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదివారం సోమారం శివారులో పని ఉండగా జేసీబీ తీసుకెళ్లామని, చీకటి పడటంతో 400 లీటర్ల డీజిల్‌ నింపి పక్కకు పెట్టామని తెలిపారు. సోమవారం ఉదయం వెళ్లే సరికి డీజిల్‌ ట్యాంకు మూత తొలగించి ఉందని, డీజిల్‌ దొంగిలించారని వివరించారు.

నివాళి

నర్సంపేట రూరల్‌ : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో ఎంసీపీఐ(యూ) నాయకుడు పానుగోటి చంద్రమౌళి చిత్రపటానికి ఆ పార్టీ అనుబంధ పీఎన్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, తదితరులు నివాళులర్పించారు. గ్రామంలో సోమవారం ఆ పార్టీ మండల కన్వీనర్‌ జన్ను రమేశ్‌ అధ్యక్షతన చంద్రమౌళి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న నివాళులర్పించి మాట్లాడారు. చంద్రమౌళి ప్రజల కోసం అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నారని, కేసుల పాలయ్యారని, పోలీసుల లాఠీ దెబ్బలను తట్టుకున్నారని తెలిపారు. చంద్రమౌళి ఆశయాల సాధనకు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాజుల వెంకటయ్య, సొల్లేటి సీతారాములు, అలీ, గోరె మియా, మొర్రి శ్రీను, పెరుమాండ్ల ఎల్లాగౌడ్‌, అబ్బదాసి అశోక్‌, బుడిగె నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కటాక్షపూర్‌ మత్తడి వద్ద ట్రాఫిక్‌ జామ్‌

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్‌ చెరువు మత్తడి జాతీయ రహదారి 163పై సోమవారం సాయంత్రం ట్రాఫిక్‌జామ్‌ అవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వాహనాలను నెమ్మదిగా పంపించారు. లారీలు ఈ మార్గంలో ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ట్రాఫిక్‌ జామ్‌ అవుతుందని వాహనదారులు చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సు టైర్‌ పేలి ఒకరికి తీవ్రగాయాలు

ఖిలా వరంగల్‌ : ఆర్టీసీ బస్సు టైర్‌ పేలి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం నక్కలపల్లి శివారులో చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. వరంగల్‌ నుంచి అన్నారం షరీఫ్‌కు సోమవారం మధ్యాహ్నం 65–70 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయల్దేరింది. బస్సు నక్కలపల్లి శివారు మలుపు వద్దకు చేరుకోగానే టైర్‌ పేలిపోయింది. దీంతో బస్సు డ్రైవర్‌ సడన్‌బ్రేక్‌ వేశాడు. బస్సులోని ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడిపోగా కల్లెడకు చెందిన దాసరి రవికి తీవ్ర గాయాలు అతడి భార్య సంధ్య, కుమార్తెతోపాటు మరో 25 మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వరంగల్‌ రైల్వేస్టేషన్‌కు చెందిన 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

జీపీ భవన నిర్మాణంలో నిర్లక్ష్యం

- స్లాబ్‌ లెవల్‌లో నిలిచిన పనులు
- అద్దె భవనంలో నిర్వహణ

నర్సంపేట రూరల్‌ : నర్సంపేట మండలంలోని చిన్నగురిజాల గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం నిర్మాణం చేపట్టినా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతోనే స్లాబ్‌ లెవల్‌లో నిలిచిపోయాయంటూ గ్రామస్తులు బహిరంగంగానే మండిపడుతున్నారు.

చిన్నగురిజాల 2019లో గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. గ్రామంలో 239 ఇళ్లు, 845 మంది జనాభా ఉన్నారు. పంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకుని కార్యాలయ భవనానికి స్థలాన్ని సేకకరించింది. అనంతరం 2023లో ప్రభుత్వం రూ.20 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీ భవన



అసంపూర్తిగా ఉన్న జీపీ భవన పనులు

నిర్మాణానికి మంజూరీ ఇచ్చింది. టెండర్‌ ప్రక్రియ పూర్తి చేసుకుని భవన నిర్మాణం చేపట్టరు. కాగా బెస్‌మెంట్‌, పిల్లర్ల పని పూర్తి చేసుకుని స్లాబ్‌ లెవల్‌ వరకు చేపట్టినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌ నిర్మాణానికి అర్ధాంతరంగా వదిలేశారు. గోడలు నిర్మించడంతోపాటు ప్లాస్టరింగ్‌, ప్లంబింగ్‌, పెయింటింగ్‌ పనులు చేయాల్సి ఉంది.

నిధుల విడుదలలో జాప్యంతోనే..

ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ భవన నిర్మాణం చేపట్టినా ప్రభుత్వ నిబంధనల మేరకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా జాప్యం చేయడంతోనే కాంట్రాక్టర్‌ నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపేశారని తెలిసింది. ఇటీవల ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్‌కు అందజేశారు.

త్వరలో పూర్తి చేయిస్తాం

జీపీ భవన నిర్మాణం త్వరలో పూర్తి చేయిస్తాం. బిల్లు రాకపోవడంతో పనులను కాంట్రాక్టర్‌ మధ్యలోనే నిలిపేశారు. ప్రభుత్వం ఇటీవల రూ.9.43 లక్షల మేరకు బిల్లు చెల్లించింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగతా పనులు పూర్తి చేయిస్తాం.

– రజనీకాంత్‌, పీఆర్‌ ఏఈ, నర్సంపేట

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

- ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌

ఖానాపురం : వన్యప్రాణుల సంరక్షణను సామాజిక బాధ్యతగా ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ (ఎఫ్‌ఆర్‌ఓ) పుప్పాల రవికిరణ్‌ అభివర్ణించారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. వన్యప్రాణుల మనుగడ పర్యావరణ సమతుల్యతపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థి దశలోనే వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు



బహుమతి అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌

కావాలని ఆకాంక్షించారు. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటే వన్యప్రాణుల సంరక్షణ సులభమవుతుందని తెలిపారు. భవిష్యత్‌ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించే దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లీడ్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు రవికుమార్‌, శోభారాణి, అటవీ శాఖ సెక్షన్‌ ఆఫీసర్‌ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నాయకులను నిలదీయండి



నర్సంపేట : కాంగ్రెస్‌ పార్టీ బాకీ కార్డ్స్‌ విడుదల చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

- బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్‌ నాయకులను నిలదీయాలని బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్‌, డాక్టర్‌ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం కాంగ్రెస్‌ బాకీ కార్డులను వెంకటనారాయణ, విద్యాసాగర్‌రెడ్డి విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్‌ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని కార్డులు ఇచ్చి తదనంతరం విస్మరించిందని విమర్శించారు. అన్ని వర్గాలనూ ప్రభుత్వం మోసం చేస్తోందని తెలిపారు. రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వలేదని చెప్పారు. వడ్లకు బోనస్‌ ఎగ్గొట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు దేవోజు సదానందం, గందె చంద్రమౌళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్డులతో విస్తృత ప్రచారం చేయండి

దుగ్గొండి : కాంగ్రెస్‌ మోసాలను వివరిస్తూ ముద్రించిన కాంగ్రెస్‌ బాకీ కార్డులను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పొన్నం మొగిలి కోరారు. మండలంలోని గిర్నిబావిలో బాకీ కార్డులను నాయకులతో కలిసి ఆయన విడుదల చేసి ఇంటింటికీ అందించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడారు. పింఛన్‌ పెంపు, మహిళలకు రూ.2500, లక్ష రూపాయలు, తులం బంగారం లాంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు శాన



దుగ్గొండి : కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు



రాయపర్తి : కార్డులు అందిస్తున్న నాయకులు

బోయిన రాజ్‌కుమార్‌, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, పెండ్యాల రాజు, రంగారావు, కమలాకర్‌, కృష్ణ, రాజన్న, రజనీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరేస్తాం

రాయపర్తి : మండలంలోని సూర్యతండా, ఏకేతండా గ్రామాల్లో గులాబీ జెండా ఎగరేస్తామని బీఆర్‌ఎస్‌ అనుబంధ ఎస్టీ సెల్‌ మండల అధ్యక్షుడు గుగులోతు జాజునాయక్‌ తెలిపారు. ఆ తండాల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ యూత్‌ మండల కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి, గ్రామ కమిటీల అధ్యక్షులు మూనావత్‌ నారాయణ, హలావత్‌ రమేశ్‌, మాజీ ఎంపీటీసీ వెంకన్న, వసుంధర్‌, రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతే ఆర్‌ఎస్‌ఎస్‌ లక్ష్యం

- తెలంగాణ సహ కార్యదర్శి గంట తిరుమల్‌

నల్లబెల్లి : జాతీయ ఐక్యతే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ (ఆర్‌ఎస్‌ఎస్‌) పని చేస్తోందని తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి గంట తిరుమల్‌ తెలిపారు. సంఘ్‌ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్‌ హాలులో సోమవారం నిర్వహించిన పదసంచాలన్‌ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘ్‌ వందేళ్లుగా దేశ అభివృద్ధి దిశగా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నట్లు చెప్పారు. స్వయం సేవకులు దేశ పునర్నిర్మాణానికి సంకల్పంతో కృషి చేయాలని కోరారు. సంఘ్‌ను విమర్శించే నైతిక హక్కు వామపక్ష పార్టీలకు లేదన్నారు. అనంతరం స్వయం సేవకులు చేపట్టిన ర్యాలీని ఆయన




సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల్‌

ప్రారంభించారు. దేశభక్తి నినాదాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రగూడెం కాకతీయ బ్రిలియంట్‌ స్టార్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ మేడవరపు కమలాకర్‌రావు, సంఘ్‌ జిల్లా సహ కార్యదర్శి ఉప్పునూతుల శంకర్‌, జిల్లా ప్రచారక్‌ విష్ణు కుమార్‌, ఖండ సంపర్క ప్రముఖ్‌ మార్త మార్కండయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

వర్ధన్నపేట : స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ సర్పంచ్‌ గుజ్జ సంపత్‌రెడ్డి కోరారు. మండలంలోని కట్య్రాల, రామవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశాలకు వారు హాజరై మాట్లాడారు. తొలుత ఇతర కొన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం భిక్షపతి, సంపత్‌రెడ్డి మాట్లాడారు. మండలంలో ఎంపీటీసీ స్థానాలను అత్యధికంగా గెల్చుకుని ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులను దక్కించుకోవాలని సూచించారు. సర్పంచ్‌ స్థానాలను పూర్తిగా కైవసం



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

చేసుకోవాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగిరేలా సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, చిలుముల్ల ఎల్లయ్య, చెవ్వల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌



సంగెం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఎస్సై వంశీకృష్ణ సోమవారం కౌన్సెలింగ్‌ చేశారు. సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. భూతగాదాలు, సెటిల్‌మెంట్లు వంటి కార్యకలాపాల జోలికి వెళ్లొద్దన్నారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, అల్లర్లు, గొడవలకు పాల్పడవద్దని చెప్పారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్‌ రాజ్‌కుమార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు.

పలువురి రిమాండ్‌

గీసుకొండ : మండలంలోని నందానాయక్‌తండాకు చెందిన పలువురిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్‌ మీడియాకు వివరాలు వెల్లడించారు. పాత కేసుల విషయంలో కోర్టుకు హాజరు కాకుండా నిర్లక్ష్యం చేస్తున్న నందనాయక్‌తండాకు చెందిన బాదావత్‌ రవి, వంచనగిరికి చెందిన బొల్లం యాదగిరి, బొల్లం అనిల్‌, బొల్లం అమ్మాయి, వసంతాపూర్‌కు చెందిన బొజ్జ యాకయ్యపై కోర్టు వారెంట్‌ జారీ చేసిందన్నారు. జడ్జి ఆదేశాల మేరకు వారిని కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన కురిమిళ్ల నర్సింహరాములు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక సమాజ సేవకుడు, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత నర్సింహరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని రాజ్‌కుమార్‌, రడం భరత్‌, తుప్పరి వికాస్‌, రడం శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

డాంబర్‌ప్లాంట్‌లో వైద్యశిబిరం

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గులోని డాంబర్‌ ప్లాంట్‌లో సోమవారం ఆత్మకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి స్పందన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సీజనల్‌ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ నర్సింగరావు, సిబ్బంది సజీనా, హేమలత, నాంచారయ్య, దుర్గాప్రసాద్‌, జునేది, సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో ఇబ్బందులు

ఐనవోలు : వేలాపాలా లేకుండా ట్రాక్టర్లతో ఇసుక (ఫిల్టరింగ్‌) కడగడంతోపాటు రవాణా చేస్తుండడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని వడ్డెరగూడెం సమీపంలోని బండపైన కొంతకాలంగా కొంతమంది ట్రాక్టర్లలో తెచ్చే మట్టిని ఫిల్టర్‌ చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గ్రామంలోని వడ్డెరకాలనీకి చెందిన వ్యక్తి ట్రాక్టర్‌ను అడ్డుపెట్టి ఫిల్టరింగ్‌ చేసుకునేందుకు వచ్చిన ట్రాక్టర్‌ యజమానులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. కాగా రోడ్డు దెబ్బతినడంతో పాటు తెల్లవారుజాము 4 గంటల నుంచి ఇసుక ట్రాక్టర్లు చప్పుడుతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం సరికాదని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. అయితే ట్రాక్టర్‌ను అడ్డుపెట్టిన వ్యక్తికి స్వల్పగాయాలైనట్లు సమాచారం.

ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు

దామెర : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ డాక్టర్‌ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. సామూహిక హోమంతో పాటు, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో దేవాలయాలు ఆధ్యాత్మికశాంతి, సామాజిక ఏకతకు ప్రతీకలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే యువతలో ధార్మికచైతన్యం, సేవాభావం, భక్తి పెంపొందుతాయన్నారు. అనంతరం ఇండ్ల రాజు ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేపట్టారు. పిట్టల రమేశ్‌, గొడిశల సాంబరాజు, ఇండ్ల శివ, నవీన్‌, అనిల్‌, రవి, నాగేందర్‌, సుమంత్‌, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలి'

ఖిలా వరంగల్‌ : టీచర్ల సర్దుబాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్‌ కోరారు. సోమవారం కరీమాబాద్‌లోని ప్రభుత్వ సహాయక వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందని చెప్పారు. ఈ నెలలో ఎస్‌ఏ–1 మూల్యాంకన పరీక్షలు ఉన్నాయని, వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటును త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్‌, రామరాజు, నరసింహారావు, పోశాల కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాలు



డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాల మధ్య బోనాలతో వెళ్తున్న మహిళలు

నర్సంపేట : పట్టణంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రేణుక ఎల్లమ్మ తల్లికి గౌడ కులస్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. తొలుత గౌడ కులస్తులు, ఘటంకుండ పెద్ద మనిషి, సారకోళ్ల పెద్ద మనిషి పురవీధుల మీదుగా బాజా భజంత్రీలు, నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. పాఖాల రోడ్డు కూడలిలో జెట్టి కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎల్లమ్మ తల్లి వేషధారణ జనాన్ని విశేషంగా ఆకర్షించింది. ఆలయంలో పూజారులు శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవతల కల్యాణం నిర్వహించారు. అనంతరం రేణుక ఎల్లమ్మకు గాపు పట్టారు. కార్యక్రమంలో గౌడ సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మద్దెల శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు గాదగోని సాంబయ్య, ఆర్థిక కార్యదర్శులు నాతి సదానందం, గిరగాని కిరణ్‌, డైరెక్టర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్‌, మొగలగాని సురేశ్‌, వేముల కృష్ణ, గిరగాని రమేశ్‌, నాగెల్లి ప్రమోద్‌, చుక్క రవి, బొట్టు పెద్దమనిషి కొయ్యడి కొమురయ్య, సారకోల పెద్దమనిషి గిరగాని చంద్రమౌళి, మాజీ మునిసిపల్‌ చైర్మన్‌ నాగెల్లి వెంకటనారాయణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, మాజీ కౌన్సిలర్‌ వేముల సాంబయ్య, గౌడ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గండి లింగయ్య, కార్యదర్శి మాచర్ల అయిలుమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కీలకం



ఖానాపురం : మాట్లాడుతున్న సౌజన్య



సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌

- ఆర్‌ఓ, స్పెషల్‌ ఆఫీసర్‌ అధికారి సౌజన్య

ఖానాపురం : స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలపై అవగాహన కీలకమని రిటర్నింగ్‌ అధికారి, స్పెషల్‌ ఆఫీసర్‌, డీటీడీఓ సౌజన్య తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌ రమేశ్‌, ఎంపీడీఓ సునీల్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సంగెం : ఎన్నికల కోడ్‌ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రిటర్నింగ్‌ అధికారి, ప్రత్యేక అధికారి రమేశ్‌ స్పష్టం చేశారు. మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయొద్దని చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణకు మండల పరిషత్‌ కార్యాలయంలోనే కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు దరఖాస్తుల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అభ్యర్థులపై వచ్చిన ఫిర్యాదులపై ఆర్‌ఓదే తుది నిర్ణయ



గీసుకొండ : మాట్లాడుతున్న తహసీల్దార్‌

మని తేటతెల్లం చేశారు. సమావేశాల్లో ఎంపీడీఓ కాసర్ల రవీందర్‌, ఎస్సై వంశీకృష్ణ, ఎంఈఓ రాము, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం కీలకం

గీసుకొండ : ఎన్నికల నిర్వహణలో అధికారుల నడుమ సమన్వయం కీలకమని రిటర్నింగ్‌ అధికారి, స్పెషల్‌ ఆఫీసర్‌ సురేశ్‌ తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిపై అధికారులు, సిబ్బందితోపాటు రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన ఉండాలన్నారు. తహసీల్దార్‌ రియాజుద్దీన్‌ మాట్లాడుతూ నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ విశ్వేశ్వర్‌ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ పోలింగ్‌ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్‌, ఎస్‌ఓ అనిల్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్‌ ట్రావెల్స్‌ కమిటీ ఎన్నిక

నర్సంపేట : పట్టణంలో ఫ్రెండ్స్‌ ట్రావెల్స్‌ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునిగాల కళాధర్‌రావు, ఉపాధ్యక్షుడిగా ముజాహిద్‌ పాషా, కార్యదర్శిగా గండి చంద్రశేఖర్‌ ఆజాద్‌ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని సభ్యులు సన్మానించారు.

